

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 27-05-2025 | సంపుటి - 24 | సంచిక - 24 | రూ : 4 | పేజీలు: 8


## కడప గడపలో
# పసుపు పండగ...




- నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- ఆరు ప్రధాన అంశాల ప్రాతిపదికగా చర్చలు, తీర్మానాలు
- చివరి రోజు ఐదు లక్షల మందితో బహిరంగ సభ
- తెదేపా మహానాడుకు భారీ ఏర్పాట్లు

**మే 26, కడప :** ఎటు చూసినా పసుపు జెండాలు.. పచ్చని తోరణాలు.. అడుగడుగునా పండగ వాతావరణం.. ఎవర్ని కదిలించినా ఉరకలెత్తే ఉత్సాహమే.. తెదేపా నాయ కులు, కార్యకర్తలు పెద్ద పండగగా భావించే మహానాడు మంగళవారం నుంచి కడప గడపలో అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. 2024 ఎన్నికల్లో పార్టీ ఘన విజయం తర్వాత జరుగుతున్న తొలి మహానాడును మూడు రోజులపాటు నభూతో.. అన్న రీతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో

తరువాయి 2లో



## పుతిన్ ప్రవర్తన మరీ మూర్ఖంగా ఉంది

- అనవసరంగా ప్రజలను చంపేస్తున్నారు: ట్రంప్
- రష్యా అధ్యక్షుడిపై ట్రంప్ ఆగ్రహం

**మే 26, వాషింగ్టన్:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌ను ఎప్పుడూ వెనకేసుకొచ్చే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మారింది. ఉక్రెయిన్‌పై గత కొన్ని రోజులుగా రష్యా భీకరంగా విరుచుకుపడుతున్న నేపథ్యంలో పుతిన్ వ్యవహారశైలిపై ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. పుతిన్ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని, అనవసరంగా భారీ సంఖ్యలో ప్రజలను హతమారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది సరైన పద్ధతి కాదన్న ట్రంప్.. ఉక్రెయిన్

తరువాయి 2లో

## సీఎం సార్‌ను తీసుకుని
# గృహప్రవేశానికి రండి!

- మంత్రి పొంగులేటికి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఆహ్వానం
- లబ్ధిదారులకు రూ.14.44 కోట్లు విడుదల

**మే 26, హైదరాబాద్:** 'ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డా. రేవంత్ సార్ ఇల్లిచ్చిండు. మీరు డబ్బులిస్తున్నారు. ఈ రోజు కూడా శ్లాబ్‌కు రూ.2 లక్షలు వచ్చాయి. రేవంత్‌రెడ్డి సార్‌ను తీసుకుని మీరు గృహప్రవేశానికి రావాలి. యాటను కోసి.. సీఎం సార్ ఇస్తున్న సన్నబియ్యంతో భోజనం పెడ్తా. తప్పకుండా రావాలి' అంటూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు లక్ష్మి ఆహ్వానించారు. దీనికి స్పందించిన మంత్రి 'మాకు పప్పన్నం పెడితే చాలు' అని అన్నారు. సోమవారం సచివాలయం నుంచి పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.14.44 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో 47,335 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. ఇందులో 7,824 ఇళ్లకు పునాది, 895 ఇళ్లకు గోడల నిర్మాణం, మరో 64 ఇళ్లకు శ్లాబ్ వరకు పూర్తయ్యాయి. ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులను విడుదల చేస్తున్నాం. ఇప్పటివరకు రూ.68.08 కోట్లు అందించాం. లబ్ధిదారులు 400600 చదరపు అడుగుల

తరువాయి 2లో



## 30న ఖరారు..?

- పీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణపై నిర్ణయాలు వాయిదా
- ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అందుబాటులో లేనందువల్లే..
- నలుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలకు కార్యవర్గంలో చోటు!
- ఒక ఎంపీకి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కే అవకాశం

2లో



## దేశ ఆకలి తీర్చే
# పెద్దన్నగా తెలంగాణ

- గతేడాది రికార్డు స్థాయిలో పంటల ఉత్పత్తులు
- 275 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి
- రాష్ట్ర అర్థ, గణాంకశాఖ అంచనాల్లో వెల్లడి



**మే 26, హైదరాబాద్ :** దేశ ప్రజల ఆకలి తీర్చే బృహత్‌కార్యంలో పెద్దన్న పాత్ర పోషించే రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. రికార్డుస్థాయి బియ్యం ఉత్పత్తితో దేశంలోనే ముందుందని రాష్ట్ర అర్థ, గణాంకశాఖ తెలిపింది. వాతావరణం అనుకూలించడం, ప్రభుత్వ సానుకూల విధానాలతో గతేడాది (202425) రాష్ట్రంలో రికార్డుస్థాయిలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరిగాయని

తరువాయి 2లో

## సరస్వతి..
# సదా స్మరామి..!

- వైభవంగా ముగిసిన పుష్కరాలు

**మే 26, కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో పన్నెండు రోజుల పాటు ఘనంగా జరిగిన సరస్వతి పుష్కరాలు సోమవారం రాత్రి 8.10 గంటలకు వైభవోపేతంగా ముగిశాయి. పుష్కరాల ముగింపు వేళ సరస్వతి మాతకు విశేష పూజలు నిర్వహించారు. సరస్వతి ఘాట్ వద్ద నిర్వహించిన నవరత్న మాలహారతితో పాటు మహాహారతి కార్యక్రమాన్ని భక్తులు వీక్షించారు. సరస్వతి పుష్కరాల ప్రత్యేకత, కాళేశ్వర క్షేత్ర వైభవాన్ని ప్రముఖ అవధాని, మాడుగుల నాగఫణిశర్మ వివరించారు. తొలి నుంచి చివరిరోజు వరకు పవిత్ర త్రివేణి సంగమంలో సుమారు 30 లక్షల

తరువాయి 2లో



# రాష్ట్రంలోకి 'నైరుతి'



- అనంతపురం మీదుగా రుతుపవనాల ఆగమనం
- జూన్‌లో సమృద్ధిగా వర్షా లకు అవకాశం

**మే 26, విశాఖపట్నం:** నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రకటించింది. కేరళను తాకిన రెండు రోజుల్లోనే ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా ఏపీలోకి ప్రవేశించాయి. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో పూర్తిగా, ప్రకాశం జిల్లాలో కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. రాబోయే మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. రాష్ట్రంలో సగటు వార్షిక వర్షపాతంలో 70 శాతం

తరువాయి 2లో

## విద్యాశాఖకూ
# కమాండ్ కంట్రోల్ సెంటర్

- అన్నిరకాల గణాంకాలు, పథకాలకు కేంద్రీకృత డ్యాష్‌బోర్డు
- తొలి విడతలో 8 విభాగాల పనులు పూర్తి



2లో

# దేశ ఆకలి తీర్చే పెద్దన్నగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ఈ శాఖ తాజాగా విడుదల చేసిన అంచనాల్లో వెల్లడించింది. బియ్యం ఒకటే కాకుండా పలు ఇతర పంటల దిగుబడి సైతం అంతకుముందుతో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు వివరించింది. తాజా నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ శాఖ అందజేసింది.

**సాధారణ సాగు విస్తీర్ణానికి మించి..**

అంతకుముందు ఏడాది(2023 24)లో 168.75 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి చేసిన తెలంగాణ మరుసటి ఏడాది(202425) దాన్ని అధిగమించి ఏకంగా 183.57 లక్షల టన్నులు సాధించింది. దేశంలోనే అత్యధికంగా బియ్యం పండిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిందని అర్థ, గణాంకశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. తెలంగాణ తర్వాత వరుసగా ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ ఉన్నాయి. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణానికి మించి వరి వేయడంతో దిగుబడులు వెల్లువెత్తాయి. ఉదాహరణకు గత రబీ(యాసంగి) సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 16 లక్షల హెక్టార్లు కాగా... గతేడాది ఏకంగా 24.04 లక్షల హెక్టార్లలో సాగయింది. రాష్ట్రవ్యాప్తంగా రైతులు 29 లక్షల వ్యవసాయ బోర్లకు కరెంటు కనెక్షన్లు తీసుకున్నారు. వీటికి నిరంతరాయ ఉచిత కరెంటు సరఫరాతో కర్షకులు వరి సాగుకే మొగ్గుచూపారు. ఫలితంగా తెలంగాణ చరిత్రలోనే అత్యధికంగా 2025 మార్చి 20న 17,162 మెగావాట్ల కరెంటు డిమాండు నమోదైనట్లు విద్యుత్ పంపిణీ సంస్థలు తెలిపాయి. గతేడాది ఖరీఫ్(వానాకాలం), రబీ(యాసంగి)లో కలిపి మొత్తం 275 లక్షల టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. దీని నుంచి 183 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తయినట్లు నివేదిక తెలిపింది. ఏటా రెండు సీజన్లలో సాగు, దిగుబడులపై క్షేత్రస్థాయిలో పంటకోత ప్రయోగాల ద్వారా శాఖ అంచనాలు వేసి నాలుగుసార్లు నివేదిక పంపుతుంది. తాజాగా మూడో ముందస్తు అంచనాల నివేదిక పంపింది. దీని ప్రకారం రాష్ట్రంలో గతేడాది మొత్తం 224 లక్షల టన్నుల ఆహారధాన్యాలు పండినట్లు కేంద్రం ప్రకటించింది. బియ్యం, పప్పు, తృణధాన్యాల దిగుబడులను మాత్రమే కేంద్రం ఆహారధాన్యాల కింద చూపుతుంది. వరిధాన్యం దిగుబడి లెక్కను పరిగణనలోకి తీసుకోదు. తృణ, చిరుధాన్యాలు కలిపి తెలంగాణలో 37.19 లక్షల టన్నులు, కందులు 1.99 లక్షల టన్నులు, శనగ 1.10 లక్షల టన్నులు, మినుములు 43,570, పెసలు 24,170, నూనెగింజలు 5.50 లక్షల టన్నులు పండినట్లు శాఖ వివరించింది.

## విద్యాశాఖకూ కమాండ్ కంట్రోల్ సెంటర్

హైదరాబాద్: పోలీస్ శాఖ కమాండ్ కంట్రోల్ సెంటర్ తరహాలో పాఠశాల విద్యాశాఖకూ విద్యాసమీక్ష కేంద్రం(వీఎస్‌కే) అందుబాటులోకి రానుంది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో నెలకొల్పిన ఈ కేంద్రం నుంచే రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల వివరాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, వివిధ రకాల పథకాలను పర్యవేక్షించవచ్చు. కేంద్రీకృత డ్యాష్‌బోర్డు ఉన్నందున పర్యవేక్షణతో పాటు సమస్త వివరాలను విశ్లేషించేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రయోజనకరమని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

**రెండేళ్ల నుంచి పనులు**

పాఠశాల విద్యాశాఖలోని అన్ని విభాగాలను పర్యవేక్షిస్తూ.. నాణ్యమైన చదువును అందించే లక్ష్యంతో అన్ని రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం విద్యాసమీక్ష కేంద్రాల(వీఎస్‌కే)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా 202223 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రానికి కేంద్ర విద్యాశాఖలోని ప్రాజెక్టు ఆమోదిత మండలి(పీఏబీ) రూ.5 కోట్లకు ఆమోదం తెలిపింది. అందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటాను భరిస్తాయి. 2023 ఏప్రిల్ నుంచే వీఎస్‌కే పనిచేయడం ప్రారంభించింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లోని రెండో అంతస్తులో దీన్ని నెలకొల్పారు. మూడు విడతల్లో 21 పనులకు సంబంధించిన వివరాలను ఒకచోటకు చేర్చి.. వాటిపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని నిర్ణయించింది. ప్రస్తుతం తొలివిడత కింద విద్యార్థుల నమోదు, ఒక్కో విద్యార్థి వివరాలు, టీచర్లు తదితర 8 అంశాలకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించి విశ్లేషించేందుకు టెక్నాలజీ మాడ్యూళ్లను రూపొందించారు. ప్రధానోపాధ్యాయులు, అధికారుల నుంచి వచ్చే సమాచారం మొత్తం ఈ కేంద్రానికి వస్తుంది. ఎప్పటి డేటానైనా(రియల్ టైమ్ డేటా) తెలుసుకోవచ్చు.

**ప్రారంభోత్సవం ఎప్పుడో?**

తొలివిడత కింద 8 రకాల పనులను పూర్తిచేసి కేంద్రీకృత డ్యాష్ బోర్డును సిద్ధం చేశారు. దాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి. ఇప్పటివరకు నేమ్‌బోర్డు కూడా పెట్టకపోవడం గమనార్హం. మరోవైపు వీఎస్‌కేలో కాల్‌సెంటర్ తరహాలో సిబ్బందిని నియమించుకొని టీచర్లకు, హెచ్‌ఎంలకు, తల్లిదండ్రులకు, అధికారులకు ఫోన్లుచేసి అభిప్రాయాలను తీసుకోవాలి. కొద్దికాలం క్రితం ఆరుగురిని నియమించారు. తర్వాత ఆర్థికశాఖ అనుమతి లేదని వారిని తొలగించారు. ఇటీవలే ఉత్తర్‌ప్రదేశ్‌లోని వీఎస్‌కేను అధికారులు పరిశీలించి వచ్చారు. అక్కడ 60 మంది సిబ్బందిని నియమించుకోవడం గమనార్హం.

## సరస్వతి.. సదా స్మరామి!

(మొదటిపేజీ తరువాయి)

మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించినట్లు దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే సుమారు 2.5 లక్షల మంది పుష్కరాలకు హాజరైనట్లు అంచనా. చివరిరోజైన సోమవారం సరస్వతి, గోదావరి ఘాట్లు భక్తులతో నిండిపోయాయి. కాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ తదితరులు పుష్కరాల్లో పాల్గొన్నారు. భక్తుల వ్యక్తిగత వాహనాలను పోలీసులు సుదూర ప్రాంతాల్లో నిలిపేశారు. దీంతో భక్తులు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం నుంచి నడిచివచ్చారు. తిరుగుప్రయాణంలోనూ ఇబ్బందులు పడ్డారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో సిరోంచకాళేశ్వరం రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సరస్వతి పుష్కరాలను విజయవంతం చేశామని, ఈ అనుభవంతో రానున్న గోదావరి పుష్కరాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## పుతిన్ ప్రవర్తన మరీ మూర్ఖంగా ఉంది

(మొదటిపేజీ తరువాయి)

మొత్తాన్ని పుతిన్ కబళించాలని చూస్తున్నారని పేర్కొనడం గమనార్హం. ఉక్రెయిన్‌రష్యా మధ్య యుద్ధాన్ని ఆపాలని గత కొంతకాలంగా ట్రంప్ ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. 30 రోజుల కాల్పుల విరమణను కూడా ప్రతిపాదించారు. దీన్ని రష్యా వ్యతిరేకించింది. అదే సమయంలో దాడుల తీవ్రతనూ పెంచింది. ''పుతిన్‌తో నాకు మంచి సంబంధాలే ఉన్నాయి. ఆయనకు ఏదో జరిగింది. మరీ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు. అనవసరంగా చాలా మంది ప్రజలను హతమారుస్తున్నారు. నేను కేవలం సైనికులు గురించి మాట్లాడటం లేదు. ఎలాంటి కారణం లేకుండా ఉక్రెయిన్‌లోని నగరాలపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నారు. ఆయనకు ఉక్రెయిన్ అంతా కావాలి. చిన్న ముక్క కాదు. ఈ విషయాన్ని నేను చాలా సార్లు చెప్పాను. అదే నిజమని నిరూపితమవుతోంది. కానీ అదే చేస్తే మాత్రం రష్యా పతనం ప్రారంభమవుతుంది'' అని ట్రంప్ హెచ్చరించారు. ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరును కూడా ట్రంప్ విమర్శించారు. జెలెన్‌స్కీ మాట్లాడే విధానం కూడా ఆ దేశానికి ఏమాత్రం మేలు చేయదని, ఆయన మాట్లాడే ప్రతి మాటా సమస్యలు సృష్టిస్తోందని చెప్పారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇకనైనా ఆపాలని పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం తాను అమెరికా అధ్యక్షుడిగా ఉండి ఉంటే, ఈ యుద్ధం మొదలయ్యేదే కాదని పునరుద్ఘాటించారు. అసమర్థత, ద్వేషంతో మొదలైన ఈ ఉద్రిక్తతలను ఆపేందుకు ప్రయత్నిస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్' సామాజిక మాధ్యమంలో రాసుకొచ్చారు. మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా భీకరంగా విరుచుకుపడుతోంది..ఆదివారం రాత్రి 355 డ్రోన్లు ప్రయోగించింది.

## 30న ఖరారు..?

హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గం ఎంపిక ఈ నెల 30కి వాయిదా పడ్డాయి. వాస్తవానికి సోమవారమే ఈ రెండింటికీ నేతల పేర్లను కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారుచేయాల్సి ఉంది. దీనిపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆది, సోమవారాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కీలక చర్చలు జరిపారు. రాహుల్‌గాంధీతో మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ అయ్యారు. కానీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సోమవారం దిల్లీలో అందుబాటులో లేనందున ఎంపిక నిర్ణయాన్ని 30కి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఖర్గేతో ఈ నెల 30న సమావేశం ఉంటుందని.. ఆ రోజున మళ్లీ దిల్లీకి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు అధిష్ఠానం సూచించినట్లు తెలిసింది. అదే రోజు మంత్రివర్గం, పీసీసీ కార్యవర్గ నేతల పేర్లను ఖరారు చేయనున్నట్లు సమాచారం. మంత్రి పదవులకు పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేలు పోటీపడుతున్నారు. నలుగురికి చోటుకల్పించాలని పార్టీ యోచిస్తోంది. వీరితోపాటు పీసీసీ పదవులకు పోటీపడుతున్న నేతల పూర్వాపరాలపై ఏఐసీసీకి వచ్చిన నివేదికల ఆధారంగా గత రెండు రోజులుగా ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. పీసీసీ రాష్ట్ర కార్యవర్గం ఎంపిక, కూర్పులో యువరక్తం.. కొత్తతరం నేతలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని రాహుల్‌గాంధీ సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వెడ్మ బొజ్జు, పర్ణికారెడ్డి, వంశీకృష్ణ, నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వంటి యువతరం నేతలకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవులు ఇవ్వాలని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తాజా సమాచారం. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా సైతం కొత్తతరం నేతలు, ఎమ్మెల్యేలను నియమించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత పీసీసీ కార్యవర్గంలో సీనియర్ ఉపాధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులుగా నియమితులైన పలువురు సీనియర్ నేతలు సరిగా పనిచేయలేదని, వారికి గాంధీభవన్‌లో కేటాయించిన గదులకు కూడా ఎన్నడూ వెళ్లలేదని ఏఐసీసీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అలాంటి నేతలకు రాష్ట్ర పార్టీ పదవులు ఇవ్వొద్దని కరాఖండిగా హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ సారి పీసీసీ కొత్త కార్యవర్గంలో అసలు సీనియర్ ఉపాధ్యక్ష నియామకాలే వద్దని గట్టి నిర్ణయం తీసుకున్నారు. సీనియర్ అనే పేరుతో ఎవరికీ పదవులు ఇచ్చేది లేదని, పనితీరే గీటురాయని ఏఐసీసీ స్పష్టం చేసింది. గుజరాత్, తెలంగాణ పీసీసీ కార్యవర్గాల ఎంపికలో దేశానికి ఆదర్శంగా నిలవాలని రాహుల్‌గాంధీ చెప్పారని నేతలు వివరించారు.

**35 మంది ఉపాధ్యక్షులు..**

పీసీసీ ఉపాధ్యక్షులుగా 35 మందిని నియమించాలని పేర్లను ప్రతిపాదించారు. వీరిలో ముగ్గురు లేదా నలుగురు ఎంపీలు, నలుగురు లేదా ఐదుగురు ఎమ్మెల్యేలకు చోటుకల్పించాలని పార్టీ పరిశీలిస్తోంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డిలకు ఉపాధ్యక్ష పదవులు దక్కవచ్చని పార్టీవర్గాలు చెబుతున్నాయి. వీరిలో ఇద్దరు ఓసీ, మరొకరు ఎస్సీ అయినందున... జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ పేరును బీసీ కోటాలో ఇదే పదవికి అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఎమ్మెల్యేల్లో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒక్కొక్కరికి ఉపాధ్యక్ష పదవి ఇవ్వాలని యోచిస్తున్నారు. మాదిగలకు మంత్రివర్గ విస్తరణలో, పీసీసీ కార్యవర్గంలో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఆ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డికి ఇటీవల విన్నవించారు. ఈ నేపథ్యంలో ఆ వర్గం నేతలకు తప్పనిసరిగా ఉపాధ్యక్ష పదవి ఇవ్వాలని పార్టీ యోచిస్తున్నట్లు నేతలు తెలిపారు. జిలాలవారీగా పార్టీ కోసం కష్టపడిన ముఖ్యనేతలకు ఉపాధ్యక్ష పదవులు ఇస్తారని సమాచారం. వాటిపై గత రెండు రోజులుగా చర్చించారు.

**ప్రధాన కార్యదర్శులుగా..**

పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా 75 మందిని నియమించాలని పేర్లను ప్రతిపాదించినట్లు నేతలు తెలిపారు. వీరికి ఉన్న అర్హతలు ఏమిటీ, పార్టీ కోసం ఎంతకాలం నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారనే అంశాలపై చర్చిస్తున్నారు. 2017 నుంచి కాంగ్రెస్‌లోనే ఉంటూ కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యమివ్వాలని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సూచించినట్లు సమాచారం. అన్ని పదవులకు పెద్దసంఖ్యలో నేతల పేర్లను ప్రతిపాదించడంపైనా ఆమె ఆరా తీసినట్లు చెబుతున్నారు. వీరు పార్టీ కోసం ఏ మేరకు కష్టపడ్డారో చెప్పాలని వివరాలు అడిగినట్లు సమాచారం. గత పనితీరు చూసి ఎంపిక చేయాలని ఆమె సూచించినట్లు తెలుస్తోంది. ఇందువల్లే నేతల ఎంపికలో కొంత జాప్యం జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నలుగురు..**

పీసీసీలో కీలకంగా భావిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులకు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, మైనార్టీ నేతలు ఫహీం, ఫిరోజ్‌ఖాన్‌ల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. బీసీ కోటాలో పీసీసీ అధ్యక్షుడు ఉన్నందున ఈ వర్గం నుంచి ఉపాధ్యక్ష పదవికి కొందరి పేర్లను పరిశీలిస్తున్నారు. అయితే, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కూడా కావాలని బీసీ వర్గానికి చెందిన పలువురు నేతలు పట్టుబడుతున్నారు. ఈ పదవులకు మరికొంత మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పోటీపడుతున్నా వివిధ సమీకరణాల నేపథ్యంలో వారిని పక్కనపెట్టినట్లు నేతలు చెబుతున్నారు.

## కులగణనపై దిల్లీలో రాహుల్‌కు కృతజ్ఞత సభ

*** కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నేతల సమావేశంలో నిర్ణయం**

దిల్లీ: కులగణనను ప్రజాఎజెండాగా మార్చి.. అమలుచేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిన లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలుపుతూ త్వరలో దిల్లీ రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నాయకులు నిర్ణయించారు. తెలంగాణతోపాటు దేశంలోని 29 రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ బలహీనవర్గాల నాయకులు సోమవారం ఇక్కడి ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో సమావేశమై దీనిపై చర్చించారు. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు సురేష్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, శ్రీహరితో పాటు, మాజీ ఎంపీలు వీహెచ్, మధుయాస్కీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కడప గడపలో పసుపు పండగ

(మొదటిపేజీ తరువాయి)



పాలుపంచుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నారు. మూడో రోజు గురువారం జరిగే బహిరంగ సభకు సుమారు 5 లక్షల మంది హాజరవుతారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. కడపలో సోమవారం ఆకాశం మేఘావృతమై.. చిరు జల్లులు పడుతున్న నేపథ్యంలో ఒకవేళ వర్షం పడితే.. మహానాడు నిర్వహణకు ఎదురయ్యే ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

**రొటీన్‌కు భిన్నంగా చర్చలు**

ముఖ్యమైన అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టడం, వాటిపై చర్చించడం, ఆమోదించడం.. సాధారణంగా మహానాడులో జరిగే ప్రక్రియ. ఈసారి దానికి కొంత భిన్నంగా తెదేపా మూల సూత్రాలు, భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా ఆరు ప్రధాన అంశాల ప్రాతిపదికగా చర్చించనున్నారు. కార్యకర్తే అధినేత, యువగళం, తెలుగుజాతివిశ్వఖ్యాతి, స్త్రీ శక్తి, సామాజిక న్యాయంపేదల ప్రగతి, అన్నదాతకు అండ అంశాలపై చర్చలు, తీర్మానాలు ఉంటాయి.

**140 ఎకరాల్లో సభ.. 450 ఎకరాల్లో పార్కింగ్**

మహానాడు నిర్వహణకు కడప శివారు చెర్లోపల్లిలో భారీ ఏర్పాట్లు చేశారు. మొదటి రెండు రోజులూ ప్రతినిధుల సభ, చివరి రోజు బహిరంగ సభ నిర్వహణకు 140 ఎకరాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. వాహనాల పార్కింగ్‌కు 450 ఎకరాలు కేటాయించారు. వేదికపై దాదాపు 450 మంది ఆసీనులు కానున్నారు.

**దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు**

మహానాడులో వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. 15 పడకలతో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లో ఐసీయూ సహా అత్యవసర వైద్య సేవలకు వసతులున్నాయి. వైద్య పరీక్షలు చేసి, మందులు ఇవ్వనున్నారు. వృద్ధులకు వినికిడి పరికరాలు, కళ్లజోళ్లు, దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేయనున్నారు. ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్‌ల సారథ్యంలో పార్టీ ప్రస్థానం, సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు సోమవారం మహానాడు ప్రాంగణంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రతినిధుల సభ ప్రధాన వేదిక కోసం ఏర్పాటు చేసిన జర్మన్ హ్యాంగర్‌పై పడ్డ వర్షం నీరు లోపలికి వస్తుండడంతో, దాని చుట్టూ ట్రెంచ్ తవ్వారు. ఆ పనులను మంత్రి రామానాయుడు పర్యవేక్షించారు.

## సీఎం సార్‌ను తీసుకుని గృహప్రవేశానికి రండి!

(మొదటిపేజీ తరువాయి)

మధ్య తమ స్థలానికి అనుగుణంగా ఇష్టమైన రీతిలో ఇంటిని నిర్మించుకునే సౌలభ్యాన్ని కల్పించాం. రాష్ట్రంలో సుమారు 250 మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది' అని మంత్రి వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## రాష్ట్రంలోకి 'నైరుతి'

(మొదటిపేజీ తరువాయి)

జూన్‌సెప్టెంబరు మధ్యకాలంలోనే కురుస్తుంది. గతేడాది సాధారణం కంటే 21 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది.

**ఈ 'వేగం' అరుదు**

సాధారణంగా జూన్ 5న రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. గతేడాది బంగాళాఖాతంలో ఏర్పడిన 'రెమాల్' తుపాను కారణంగా ఎనిమిది రోజులు ముందుగా కేరళను తాకాయి. అంతేవేగంగా సాధారణం కంటే మూడు రోజులు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ సారి మహారాష్ట్ర పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం, ఇతర పరిస్థితులు అనుకూలించడంతో పది రోజులు ముందుగానే రాష్ట్రానికి వచ్చాయి. 'దక్షిణాది రాష్ట్రాల్లో రుతుపవనాలు దాదాపుగా విస్తరించాయి. మంగళవారం నాటికి తెలంగాణలోని మిగిలిన ప్రాంతాలు, రాజమహేంద్రవరం, తుని వరకు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులున్నాయి. వీటి ప్రభావంతో జూన్‌లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముంది. ఉత్తరాదిలో కొన్ని ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో జూన్ 2 తర్వాత పశ్చిమబెంగాల్, బిహార్ వైపు విస్తరణ నెమ్మదించే అవకాశముంది' అని ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్ కేజే రమేశ్ తెలిపారు. ప్రస్తుతం మరాఠ్వాడా (మహారాష్ట్ర) పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. అక్కడి నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా (ఏపీ) వరకు ఉపరితల ద్రోణి ఉంది. ఈ అల్పపీడనం బలహీనపడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా బంగాళాఖాతంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు అంచనా. తర్వాత ఇది బలపడి ఉత్తర, వాయవ్య దిశగా కదులుతూ ఒడిశా వైపు పయనించి.. అనంతరం ఉత్తర దిశగా ప్రయాణిస్తుందని అంచనా. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఉత్తరాంధ్రపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

**రాబోయే నాలుగు రోజులు వర్షా లు**

రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలకు అవకాశముందని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా గంటకు 60 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం అనంతపురం, కర్నూలు, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాల్లో, బుధవారం అనంతపురం, కర్నూలు, నంద్యాల, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో ఈ నెల 30 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈదురు గాలుల ప్రభావంతో విద్యుత్తు స్తంభాలు, చెట్లు నేలకొరిగే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)లో 8 సెం.మీ., విజయనగరం జిల్లాలోని మెరకముడిదాంలో 6 సెం.మీ. వర్షం కురిసింది.

# బోల్లారం జిల్లా పరిషత్ పాఠశాల ఆధునీకరణ..

* **బొల్లారం జిల్లా పరిషత్ పాఠశాల ఆధునీకరణ..**
* **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడి**



జిన్నారం (బొల్లారం),ప్రజాస్ఫూర్తి 26: జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను 60 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో ఆధునికరిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పాఠశాలలను పరిశీలించారు. సమస్యలను స్వయంగా పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో సౌకర్యాలు లేకపోవడం మూలంగా విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ 60 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో పాఠశాలను ఆధునికరించినందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రధానంగా పాఠశాలకు పూర్తిస్థాయిలో రంగులు వేయడంతో పాటు.. గ్రౌండ్ లెవెలింగ్, క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఫుట్ బాల్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ను ఆదేశించారు.

## ఘనంగా అంతర్జాతీయ పైలట్ల దినోత్సవం




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ పైలట్ల దినోత్సవ వేడుకలను సోమవారం కొత్తగూడెం ఎంసీహెచ్ రామవరం లోని 108 కార్యాలయంలో జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్, మహబూబాబాద్ జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైలెట్లు అందరూ కూడా 24 గంటలు అందుబాటులో ఉంటూ క్షతగాత్రులను గోల్డెన్ అవర్లో హాస్పటల్ కు తీసుకువెళ్లడంలో ప్రధాన భూమికను పోషించాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలను చేశారు. అనంతరం రెండు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న పలువురు పైలట్లను ఆయన ఘనంగా సన్మానించి వారిచే కేకును కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో రవి కుమార్, అనిల్ కుమార్, హరి శంకర్, తరుణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి పల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు , సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి వెంటనే విచారణ చేపట్టి పరిష్కరించే విధంగా కృషి చేయాలని అక్కడ ఉన్న అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయాలలో దాడులు తెలంగాణ సంస్కృతి కాదు

* **దాడులు హేయమైన చర్య**
* **బిజెపి జిల్లా కౌన్సెల్ మెంబర్ మెరుగు అంజా గౌడ్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాజకీయాలలో దాడులు తెలంగాణ సంస్కృతి కాదని బిజెపి జిల్లా కౌన్సెల్ మెంబర్ మెరుగు అంజా గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కార్యాలయం దగ్గర దాడులను ఆయన తీవ్రంగా ఖండిరచారు. దాడులు చేసుకోవడం హేయమైన చర్య పేర్కొన్నారు. ఈలాంటి దాడులు చేసుకోవడం వల్ల ప్రజలలో రాజకీయ నాయకులు అంటే చులకన భావం కలుగుతుందని పేర్కొన్నారు. రాజకీయాలు నైతిక విలువలతో కూడినవిగా ఉండాలని తెలిపారు.




## వై.ఎన్.ఎస్.ఏ సర్టిఫికెట్ అందుకున్న సుగుణారావు

* **పలువురి అభినందనలు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లాలో ఆక్యుపంచర్, ఆక్యుప్రెషర్ సైన్స్ డ్రగ్లెస్ థెరపీలో హీలర్ గా అంచలంచెలుగా ఎదుగుతున్న . హెచ్ఆర్. జి. సుగుణారావు వై.ఎన్.ఎస్.ఏ కోర్సు పూర్తి చేసి మరో సర్టిఫికెట్ ని అందుకున్నాడు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో జరిగిన ప్రకృతి ఆరోగ్య మహాసభలలో ఈ సర్టిఫికెట్ను అందుకున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.సిద్ధార్థ ఆరోగ్య కేంద్రం నిర్వాహకుడు, తూమాట్ల వెంకన్న ఆధ్వర్యంలో, ప్రముఖ ట్రైనర్ డాక్టర్ ఎస్ చెన్న అప్పారావు నేచురల్ హీలింగ్ సెంటర్ ద్వారా యమమోటో న్యూ స్కాల్ ఆక్యూపంచర్( వై.ఎన్.ఎస్.ఏ)బేసిక్ అండ్ అడ్వాన్స్ కోర్సులు పూర్తిచేసి ఈ సర్టిఫికెట్ ను డా.అనిల్ కుమార్, డా.ఆరూరి సుధాకర్, పర్యావరణవేత్త పద్మా రెడ్డి, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కొండా నాగేశ్వరరావు, ఎం. నరసయ్య, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య, అర్జున్ రావుల చేతుల మీదుగా సర్టిఫికెట్ను అందుకున్నాడు. కాగా ఆయన్ను కొత్తగూడెంలోనే ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు ప్రముఖ కవి జయరాజు, సభ్యులు డా.బి. కృష్ణయ్య, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, మహమ్మద్ ముస్తఫా, సింగరేణి ఏజీఎం గోనే శ్రీకాంత్, కె హెచ్ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు తుమ్మలపల్లి ప్రసాద్, ప్రముఖ సింగర్ వెంకట ముత్యం లు అభినందించారు.



## ప్రజా ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలం

* **బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్**
* **ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రజా ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ విమర్శించారు. ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం ముందు సోమవారం అర్హులైన లబ్ధిదారులతో కలిసి బిజెపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అడ్డగోలుగా హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతుందని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అసలైన అర్హులకు అందించడం లేదని ఆరోపించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూతూ మంత్రంగా అమలు చేసి చేతులు దులుపుకుందని అన్నారు. ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు పరిచే వరకు వదిలేది లేదని, హామీలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన బిజెపి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, మెంగని మహేందర్, చిట్నేని శ్రీనివాస రావు, బాధా నరేష్, వరి వెంకటేష్, ఎదూనూరి గోపీ, కోల కృష్ణ, చీకోటి మహేష్, పొన్నాల సత్యం రెడ్డి, బత్తుల గణేష్, శివ, దేవరాజు,మిస శంకర్, ఊరడి రాజు, మోహన్, బాల్ రెడ్డి, దీటి సత్తయ్య, రమేష్, మిస శ్రీను, మద్దికుంట రమేష్, అజయ్, పెంటం నరేష్, పరకాల వేణు, రఘు, ప్రశాంత్, పద్మ, మహేశ్వరీ తదితరులున్నారు.




## భాధితుల సమస్యల పట్ల విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారించాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయానికి వివిధ రకాల సమస్యలతో వచ్చిన భాదితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.భాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు.జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం జరగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని అధికారులకు ఆదేశించారు.

## జీలుగు విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

**: ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి**



జిన్నారం,ప్రజాస్ఫూర్తి 26: జిన్నారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయంలో రైతులకు వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి తో కలిసి జీలుగులు పంపిణీ చేశారు ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు పంట దిగుబడి ఎక్కువగా రావడానికి జీలుగులు రైతులకు మరింత దోహదపడతాయని మండల కేంద్రంలో వివిధ గ్రామాలలో ఉండే రైతులందరూ ఈ జీలుగులు సద్వినియం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ వైస్ ఎంపీపీ గంగ రమేష్, రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి మన జాతరలు

**: ఎమ్మెల్యే గూడెం**



జిన్నారం,ప్రజాస్ఫూర్తి 26: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజవర్గం జిన్నారం మండల పరిధిలోని అందూరు గ్రామంలో నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్కాపురం రాము నాగమణి పెళ్లిరోజు వేడుకలు



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి తాపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెళ్లి వేడుకలు జరుపుకుంటున్న సంఘం నిఘావిభాగం మల్కాపురం రాము నాగమణి దంపతులకు సంఘం తరఫున ఘనంగా పెళ్లి రోజు వేడుకలు జరిగాయి ఇందులో భాగంగా అధ్యక్షులు పబ్బాల శ్రీరాములు , దొమ్మాట సంజీవ, నాగపురి శ్రీను, పబ్బాల రాజు, సారాశి ఉప్పలయ్య,బండారి మల్లేష్ నిర్వహించడం జరిగింది

# ప్రముఖ విద్యావేత్త దివంగత దరిపల్లి అనంతరాములుకు ఘన నివాళి

యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : స్వర్గీయ దరిపల్లి అనంతరాములు 4 వ వర్ధంతి సందర్భంగా వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనంతా రం లో దరిపల్లి అనంత రాములు చిత్రపటానికి వాత్సల్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దరిపల్లి నవీన్ కుమార్ , దరిపల్లి ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ,వాత్సల్య కాలేజీ అఫ్ ఫార్మసీ, వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, వాత్సల్య కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, కృషి ఐటిఐ, శ్రీ వాగ్దేవి జూనియర్& ఒకేషనల్ కళాశాల, శ్రీ సాయి కృప డిగ్రీ, పిజి కళాశాల, భువనగిరి, దరిపల్లి అనంతరాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజి, ఖమ్మం, వాణి ఐ.టి.ఐ., ఖమ్మం, గౌతమ బుద్ధ మైనారిటీ ఐ.టి.ఐ, ఇల్లందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ల యందు మొదలగు కళాశాలల., విద్యాసంస్థల ఫౌండర్ , తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నల్లగొండ , ఖమ్మం జిల్లాలలో ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పి లక్షకు పైగా విద్యార్థులను తీర్చిదిద్దారు. ఎందరో విద్యార్థులకు ఉపాధిని కల్పించారు. తమ విద్యాసంస్థలలో ఎంతోమంది బోధన, బోధనేతర సిబ్బందికి ఉపాధి ఇచ్చాడు. అంతేకాక, ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ బిసి సెల్ చైర్మన్ గా, బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులుగా బిసిల అభ్యున్నతికి యెనలేని సేవ చేశారు. శాలివాహన కుమ్మర్ల ఉమ్మడి రాష్ట్రల అధ్యక్షుడిగా కుమ్మరుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. ఉమ్మడి రాష్ట్రల ప్రయివేట్ ఇంజనీరింగ్ కాలేజీల , ప్రయివేట్



ఐ.టి.ఐల ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కష్టపడి ఎన్నో పనులు పూర్తి చేసినారు. ఇలా చెప్పుకుంటూపోతే... ఇంకా ఎన్నో, ఎన్నెన్నో అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బీవీ రెడ్డి, వాత్సల్య పాలిటెక్నిక్ కళాశాల ఇన్చార్జి సురేష్, కృషి ఐటీఐ ప్రిన్సిపల్ నామోజి రమేష్, శ్రీ వాగ్దేవి జూనియర్ & ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ కొలను శ్రావణ్ రెడ్డి, శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ యాకూబ్, వాత్సల్య ఫార్మసీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీధర్ బాబు అధ్యాపకులు వెంకటేష్, సునీల్, శ్యామ్, మోయిన్, రాంబాబు నాన్ టీచింగ్ స్టాఫ్ గోపాలకృష్ణ, శంకర్, కల్పన, స్నాపిక, కావ్య , విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని దరిపల్లి అనంత రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మాతృశ్రీ ప్రభంజనం

**- మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రకటించిన గోల్డ్ మెడల్ జాబితాలో బొమ్మకంటి పూజ**





**- అభినందించిన కళాశాల యాజమాన్యం**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రకటించిన గోల్డ్ మెడల్ జాబితాలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాల మరోసారి ప్రభంజనం సృష్టించింది. కళాశాలకు చెందిన విద్యార్థిని బొమ్మకంటి పూజ (బి.కాం కంప్యూటర్) ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో ఉత్తమ ఫలితాలను సాధించింది. మహాత్మా గాంధీ యూనివర్సిటీ స్థాయిలో బంగారు పథకాన్ని సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ డా.వి.సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు వారి కలలను సాకారం చేసుకోవాలన్నారు. బంగారు పథకాన్ని సాధించిన విద్యార్థిని బొమ్మకంటి పూజను పుష్పగుచ్చంతో అభినందించారు. రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మహేందర్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## చల్లూరు లో వైభవోపేతంగా





## బీరప్ప పండుగ వేడుకలు

*** కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీసీ నేత జూకంటి**

రాజాపేట , ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం చల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప,అక్క మహంకాళి, చౌడాలమ్మ కళ్యాణ మహోత్సవం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్, కురుమ సంఘం రాజపేట మండల అధ్యక్షుడు వస్పరి సుధాకర్, యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కవిడే మహేందర్, సీనియర్ జర్నలిస్టు మీస వెంకటేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లూరు కురుమ సంఘం నాయకులు చెట్కూరి కుమార్,మీస బాల మల్లయ్య, బింగి కర్ణాకర్, దిడ్డిగా రమేష్,కురుమ కుల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఈశ్వరిపురి కాలనీ లో అంతర్గత సి సి రోడ్ల నిర్మాణం చేపడతా

*** కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి డివిజన్ లోని ఈశ్వరిపురి కాలనీలో కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ ఈశ్వరిపురి కాలనీ వాసులు పాదయాత్రలో తన దృష్టి కి తీసుకొచ్చిన అంతర్గత రోడ్ల సమస్యను తెలుసుకొని తానే స్వయంగా కాలనీవాసులతో , జి హెచ్ ఎమ్ సి అధికారులతో కలసి పాదయాత్ర నిర్వహించానని తెలిపారు. ఈశ్వరిపురి కాలనీలోని ప్రస్తుతం ఉన్న అంతర్గత రోడ్లు అద్వానంగా ఉన్నాయని వాటి స్థానంలో కాలనీ వాసుల కోరిక మేరకు నూతన సి సి రోడ్ల నిర్మాణం చేయిస్తామని వారికి హామీ ఇచ్చామన్నారు.సి సి రోడ్ల నిర్మాణం కొరకు సత్వర చర్యలు చేపట్టి ప్రతిపాదనలు అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించానన్నారు. ఈ కార్యక్రమంలో జి హెచ్ ఎమ్ సికాప్రా డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్ , సిబ్బంది, ఈశ్వరిపురి కాలనీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి , సభ్యులు వేణు చారి మరియు కాలనీవాసులు, డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జి అరుణ్ కిరణ్ , యూత్ సభ్యులు మనోజ్ కుమార్, విజయ్ కుమార్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అడుగున కష్టాలతో నిండా మునుగుతున్న రైతులు

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలంలోని రైతాంగం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తాజా మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాజపేట మండలం జలసాధన సమితి జేఏసీ కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్ లు ఆరోపించారు. సోమవారం రాజాపేట లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు జలాలు అందిస్తామని, గొలుసు కట్టు చెరువులను నీటితో నింపుతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతుబంధు సరిగా అమలు కాక అప్పులతో ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు విక్రయించే సందర్భంలో కొనసాగుతున్న అలసత్వంతో ఐకెపి కేంద్రాలలోని ధాన్యం సరిగ్గా కొనుగోలు జరగడంలేదని ఆరోపించారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం స్పందించాలని జస్వంత్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు



గుంటి మధుసూదన్ రెడ్డి, జల సాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, టిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, రామచంద్రారెడ్డి, గుంటి రాజయ్య, కుమ్మరి పుల్లయ్య, బాల్దే సిద్దులు,బొడ్డు భూపాల్, మాడోత్ లక్ష్మణ్, గజ్జల రాజు, యాదగిరి తదితరులు ఉన్నారు.

## సమాజానికి కమ్యూనిస్టులు అవసరం



**- ఎర్రజెండా పార్టీలన్నీ ఏకమవ్వాలి**
**- మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలి**
**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సమాజానికి కమ్యూనిస్టులు అవసరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి మాట్లాడారు. సమాజానికి కమ్యూనిస్టుల అవసరం చాలా ఉన్నదని, మతోన్మాద బిజెపి కమ్యూనిస్టులపై రాక్షస నిరంకుశ పరిపాలన కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని నిలువరించేందుకు ఎర్రజెండా వామపక్ష పార్టీలని ఒక తాటిపైకి వచ్చి ప్రజా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి గూడెంలో వందేళ్ల సిపిఐ చరిత్రను అమరుల త్యాగాలను, పోరాట ఘట్టాలను గుర్తు చేస్తూ అమరుల ఆశయా సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 8నుంచి 11వ తేదీ వరకు మేడ్చల్ లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, సెప్టెంబర్ 18నుంచి 23వ తేదీ వరకు చండీగఢ్ లో జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. ఆదివాసి ప్రజలను, మావోయిస్టులను చట్ట విరుద్ధంగా హత్యలు చేస్తున్నారని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ హత్యలని బిజెపి చేసిన హత్యలేనని మండిపడ్డారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఎన్కౌంటర్లు చేయడం అప్రజా స్వామికమని, వామపక్ష భావజాలాన్ని, మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాని మోడీ, అమిత్ షా ఆపరేషన్ కగారు చేపట్టి విచ్చలవిడిగా మావోయిస్టులను బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగారును వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. బిజెపి పార్టీ మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా భయపడుతుందన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యుడు కే శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, కలకొండ సంజీవ, ఉడత రామలింగం, ఎస్ ఏ రెహమాన్, టంగుటూరి రాములు, కొండూరు వెంకటేష్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ రిటైల్ కూరగాయల మార్కెట్ నూతన అధ్యక్షుడిగా ఆకిటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్, కుషాయిగూడ లోని రిటైల్ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా ఆకిటి శ్రీనివాస్ రెడ్డి 20 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. సోమవారం మార్కెట్ ప్రాంగణంలో పోలీసుల పర్యవేక్షణలో, ఎన్నికల ఇంచార్జ్ ఎంఎస్ చారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 178 ఓట్లకు గాను 174 ఓట్లు పోలయ్యాయి. ఆకిటి శ్రీనివాస్ రెడ్డికి 97 ఓట్లు పోలవ్వగా తన సమీప ప్రత్యర్థి పారేపల్లి చంద్రయ్య 76 ఓట్లు సాధించారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓల్డ్ మల్లాపూర్, బీసీ ఏరియా లో యాభై ఒక్క లక్షల రూపాయలతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు , పన్నెండు లక్షల రూపాయలతో నాచారం, బాబానగర్ కాలనీలోని రజక శ్మశాన వాటికలో బర్నింగ్ ఫ్లాట్ ఫార్మ్, స్నానపు గదుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్ ఎల్ ఏ బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, ఈ కార్యక్రమంలో జి హెచ్ ఎమ్ సి ఇంజినీరింగ్ డి ఈ రూపా, ఏ ఈ శ్రవంతి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్, ఓల్డ్ మల్లాపూర్ వాసులు, నాచారం రజక సంఘం సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంస్థాన్ నారాయణపురం మండలం శేరుగూడెం గ్రామానికి చెందిన కర్తాల సత్తయ్య, అతని భార్య పార్వతమ్మలు వలిగొండ మండలం సంగెం గ్రామంలోని బొడ్రాయి పండుగకు బైక్ పై వెళ్లి, సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి క్రాస్ రోడ్ వద్ద హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్తున్న లారీ (ఎన్ఎల్ 02ఎఎ 0364) అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో సత్తయ్య, పార్వతమ్మలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలిస్తుండగా పార్వతమ్మ మార్గమధ్యలో మృతి చెందింది. భర్త సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'నిందలు..దండాలు..చందాలు..' ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో శతాబ్దపు అతిపెద్ద మోసమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. పార్టీ నుంచి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలకు కర్రు కాల్చి వాతపెట్టాలన్నారు. 'నిందలు, దండాలు, చందాలు' సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విధానమని ఎద్దేవా చేశారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా, కాంగ్రెస్ కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం భయపడు తోందని అన్నారు. జూన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని, బూత్ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తరలిరావాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు రోజు కూలీ రూ.600ఇవ్వాలని.. సంవత్సరానికి 200రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు తరలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చౌటుప్పల మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని మందోళ్ళగూడెం, దర్మోజిగూడెం గ్రామాలలోని ఉపాధి హామీ పని ప్రదేశాలను సోమవారం సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండమడుగు నర్సింహ్మా మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వారం వారం డబ్బులు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. పేరుకు ప్రభుత్వము రోజు కూలీ రూ.307నిర్ణయించినా, రూ.150నుంచి రూ.230దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొలతలతో సంబంధం లేకుండా నిర్ణయించిన రేటు కాకుండా రోజు కూలీ రూ.600ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 6కోట్ల పని దినాలు అవసరం ఉంటే మోడీ ప్రభుత్వం 3కోట్ల పని దినాలు మంజూరు చేస్తే మరి మిగతా రోజులు కార్మికులు ఏమి పని చేయాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సంవత్సరానికి 200రోజుల పని దినాలు కల్పించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీలు ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను, ఫీల్డ్ అసిస్టెంట్లను భర్తీ చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగాదేవి సైదులు




మాట్లాడుతూ పని ప్రదేశంలో తాగడానికి నీళ్లు, నీడ కోసం టెంట్, పని ప్రదేశంలో గాయపడితే చికిత్స అందించడానికి మెడికల్ కిట్టు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి వారికి పని కల్పించాలని, నూతన జాబులు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడితే రోజు కూలీ కట్టి ఇవ్వాలని, చనిపోతే 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, వాచర్నును, మేట్లను గుర్తించి అర్హత కలిగిన వారందరికీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని వీటి సాధన కోసం ఈనెల 30న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొజ్జ బాలయ్య, జిఎంపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు యాట ముత్యాలు, జంగం అంజయ్య , పెంటారెడ్డి, సిఐటియు నాయకులు కొంతం శ్రీనివాస్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ చెనబోయిన జ్యోతి, ఉపాధి హామీ కార్మికులు యాదిరెడ్డి, అంజయ్య, పగిళ్ల అనుజ, నీళ్ల కావ్య, యాట బక్కయ్య, గంట సప్న, నీళ్ల రేణుక, కవిత, సప్పిడి రాములమ్మ, అంజమ్మ, బుచ్చమ్మ, జంగమ్మ, జ్యోతి, సప్పిడి కృష్ణారెడ్డి, యాట ఎట్టయ్య, నీళ్ల యాదగిరి, జె శ్రీలత, వై పద్మ, అనిత, నిర్మల, శంకరమ్మ, అనసూయ, మంగ, బుచ్చమ్మ, సునీత, అమృత, పద్మ, ఇంద్ర, లావణ్య, శైలజ, జయమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

## నమ్మకానికి, నాణ్యమైన సేవలకు చిరునామా
# హెచ్.కె పర్మినెంట్ మేకప్ క్లినిక్ & హాస్పిటల్

*** సంస్థపై ఇటీవల వచ్చిన ఆరోపణలను ఖండించిన హెచ్.కె పీఎంసీ ప్రతినిధులు**

హైదరాబాద్, 26 మే ప్రజాస్ఫూర్తి: చర్మ సంబంధిత సమస్యల పరిష్కారానికి హెచ్.కె పర్మినెంట్ మేకప్ క్లినిక్ & హాస్పిటల్ హెచ్.కె పీఎంసీ సరైన ఎంపికగా నిలుస్తోంది. అత్యుత్తమ సేవలను అందిస్తూ నమ్మకానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. అనుభవజ్ఞులైన నిపుణులు.. అత్యాధునిక సదుపాయాలు హెచ్.కె పర్మినెంట్ మేకప్ క్లినిక్ & హాస్పిటల్ సొంతం..! తెలంగాణలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతూ ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోనూ ప్రస్తుతం ఇది విస్తరించింది. ఈ వివరాలను హెచ్.కె ఫార్మా & కాస్మోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు కార్తీక్ పూత, హర్షిత అజ్మీరా నాయక్ (హెచ్.కె పర్మినెంట్ మేకప్ క్లినిక్ & హాస్పిటల్) వెల్లడించారు. అలాగే ఇటీవల కాలంలో ఈ సంస్థపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను వారు ఖండించారు. ఈ మేరకు హైదరాబాద్ లో మీడియా సమావేశం నిర్వహించారు. హై కోర్టు అడ్వకేట్ ఎన్. నాగూర్ బాబు ఇందులో పాల్గొన్నారు.




కాగా, స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ టెక్నాలజీతో పాటు నిష్ణాతులైన డెర్మటాలజిస్టులు, అసిస్టెంట్ డాక్టర్లు, నైపుణ్యం కలిగిన నర్సులు, సాంకేతిక నిపుణులు హెచ్.కె పర్మినెంట్ మేకప్ క్లినిక్ లో అందుబాటులో ఉన్నారు. ప్రతినిత్యం ఎంతో మందికి వారంతా అమూల్యమైన సేవలను అందిస్తున్నారు. పేషెంట్ల భద్రతతో పాటు క్వాలిటీకి హెచ్.కె పీఎంసీకి అధిక ప్రాధాన్యమిస్తోంది. అలాగే కార్యకలాపాల్లో పూర్తి పారదర్శకత, నిబద్ధతను చూపిస్తోంది. ఇంత నిజాయితీగా వ్యవహరిస్తున్న హెచ్.కె పీఎంసీపై ఇటీవలి కాలంలో కొంత మంది అక్కసు వెళ్లగక్కుతున్నారు. సంస్థ ఎదుగుదలను జీర్ణించుకోలేక సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అయితే ఇలాంటి వాటిని ఏ మాత్రం ఉపేక్షించని హెచ్.కె పీఎంసీ... అసలు నిజాలు ఏంటో మీడియా సమావేశంలో కుండబద్దలు కొట్టింది. తమ విశ్వసనీయతకు భంగం కలిగిస్తున్న వారి తీరును సంస్థ డైరెక్టర్లు కార్తీక్ పూత, హర్షిత అజ్మీరా నాయక్ ఎండగట్టారు. అంతేకాదు హెచ్.కె పీఎంసీలో పని చేసే డెర్మటాలజిస్టులు, అసిస్టెంట్ డాక్టర్లు, నైపుణ్యం కలిగిన నర్సులు, సాంకేతిక నిపుణులు పరిచయం చేసి.. వారి సర్టిఫికేషన్లను కూడా చూపించారు. దీంతో పాటు పర్మినెంట్ మేకప్ టెక్నాలజీ & ట్రీట్ మెంట్ లో వచ్చిన తాజా మార్పుల గురించి తెలియజేశారు. అలాగే, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ప్రజలెవరూ నమ్మవద్దని వారు కోరారు. అవన్నీ పుకార్లేనని స్పష్టం చేశారు. ట్రీట్ మెంట్ తీసుకోవాలనుకేవాళ్లు తమ క్లినిక్ ను సందర్శించి.. పూర్తి వివరాలను ముందుగానే తెలుసుకోవచ్చని చెప్పారు. ఆ తర్వాతే చికిత్స ప్రారంభిస్తామని తెలిపారు. ఇది హెచ్.కె పీఎంసీ అనుసరిస్తున్న పారదర్శక విధానాన్ని, పేషెంట్లకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది.

## పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఆలోచించారా?: భట్టి విక్రమార్క



నాగర్‌కర్నూల్: భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రూ.12 వేల కోట్లతో ఇటీవల నల్లమల డిక్లరేషన్ ప్రకటించామన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పోల్కంపల్లి, బొమ్మంపల్లి, పదర సబ్ స్టేషన్లను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఆలోచించారా? అని ప్రశ్నించారు. ఉద్యోగులకు గత భారాస ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను క్రమంగా చెల్లిస్తున్నామన్నారు. "ఉద్యోగులకు రూ.10 వేల కోట్ల బకాయిలు ఉంటే రూ.8వేల కోట్లు చెల్లించాం. రాష్ట్రంలో ఇళ్లులేని కుటుంబం ఉండకూడదని ప్రభుత్వం ఆలోచిస్తోంది. రూ.5 లక్షలకు తగ్గకుండా ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు ఇవ్వాలని ఆలోచిస్తున్నాం. విద్యావ్యవస్థను గాడిలో పెడుతున్నాం." అని భట్టి విక్రమార్క అన్నారు.

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులపై
# స్పందించిన కవిత...



హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, తన సోదరుడు కేటీఆర్ కు ఏసీబీ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. నోటీసులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తమ వైఫల్యాలు, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ క్రీడలో భాగంగానే ఏసీబీ నోటీసులు జారీ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. తమ పార్టీ నేతలకు వరుసగా నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు తేటతెల్లమైందని ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకొని నిలబడిన చరిత్ర కేసీఆర్ సైనికులకు ఉందన్నారు.

## జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌పై కేసు నమోదు




జీడిమెట్ల: ఆర్థిక లావాదేవీల్లో జోక్యం చేసుకొని బెదిరించారంటూ జీహెచ్ఎంసీ పరిధిలోని సూరారం కార్పొరేటర్ సత్యనారాయణపై కేసు నమోదైంది. కోర్టు అనుమతితో ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇల్లు అమ్మిన డబ్బులు ఇవ్వాలంటూ అంజన్ గౌడ్ అనే వ్యక్తిని కార్పొరేటర్ బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అంజన్ గౌడ్ మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించాడు. అంజన్ గౌడ్‌ను కాపాడిన పోలీసులు కార్పొరేటర్‌పై కేసు నమోదు చేశారు.

## జూన్ 8, 9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ..
# ఏర్పాట్లపై డీసీపీ సమీక్ష

హైదరాబాద్: జూన్ 8 ,9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ జరగనుంది. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిన సోదరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పంపిణీ ఏర్పాట్లపై 21 శాఖల అధికారులతో సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి సమీక్ష నిర్వహించారు. నిర్వాహకులు, ఎగ్జిబిషన్ సొసైటీ, ఎన్జీవోలు ఇతర శాఖల అధికారులతో చర్చించారు. గతేడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



## ముగిసిన సరస్వతి పుష్కరాలు..
# ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: తెలంగాణ సరస్వతి పుష్కరాలు ముగిశాయి. కాళేశ్వరంలోని సరస్వతి ఘాట్ వద్ద జరిగిన పుష్కరాల ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. కాళేశ్వరంలో ఈ నెల 15న ప్రారంభమైన పుష్కరాలు నేటి వరకు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఆఖరి రోజున మాడుగుల నాగఫణి శర్మ సరస్వతి పుష్కరాలు, కాళేశ్వర క్షేత్ర వైభవాన్ని భక్తులకు తెలియజేశారు. పండితులు సరస్వతి నవరత్న మాల హారతిని నిర్వహించారు. అనంతరం సరస్వతీ దేవీకి కర్పూర నీరాజనం సమర్పించారు.



పుష్కరాలకు చివరి రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. దీంతో పుష్కర్ ఘాట్ పరిసరాలు శివనామస్మరణతో మర్మోగాయి. మొత్తం 12 రోజులపాటు సాగిన త్రివేణి సంగమంలో దాదాపు 30లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని అంచనా.

# కేటీఆర్‌కు అవినీతి నిరోధకశాఖ నోటీసులు

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. భారాస ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ కేసులో ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, నెలాఖరులో యూకే, అమెరికా పర్యటన షెడ్యూల్ ఇప్పటికే ఖరారైనందున.. తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతానని కేటీఆర్ బదులిచ్చారు. "రాజకీయ వేధింపుల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు కోసం తహతహలాడుతున్నారు. 48 గంటల క్రితం ఈడీ ఛార్జ్‌షీట్‌లో రేవంత్ పేరు వచ్చింది. 24 గంటల క్రితమే ప్రధాని సహా భాజపా అగ్రనేతలను రేవంత్ కలిశారు. ఇవాళ నాకు ఏసీబీ నుంచి నోటీసులు వచ్చాయి. మనీలాండరింగ్‌లో రేవంత్ ప్రమేయంపై భాజపా నుంచి ఒక్క మాట కూడా లేదు. రేవంత్‌రెడ్డి నాయకుడిగా, పాలకుడిగా విఫలమయ్యారు. అందుకే ఆయన కక్ష పూరిత చర్యలకు పాల్పడుతున్నారు. చట్టాన్ని గౌరవించే



వ్యక్తిగా విచారణకు సహకరిస్తాను" అని కేటీఆర్ పేర్కొన్నారు. నోటీసులపై ఏసీబీకి లిఖిత పూర్వక సమాచారమిచ్చినట్లు ఆయన తెలిపారు.

# నడక.. పెరుగంతే మేలు..!

పరిగెడుతూ పాలు తాగడం కన్నా నిలబడి నీళ్లు తాగడం మేలన్నది పెద్దల మాట. వాళ్లు చెప్పినట్టే నాలుగు కిలోమీటర్లు పరుగెత్తి ఆయాసపడే కంటే నెమ్మదిగా రెండు కిలోమీటర్లు నడిచింది మేలని డాక్టర్లు చెబుతున్నారు. నడక, పరుగు... రెండూ ఆరోగ్యానికి మంచివే. కానీ, అధిక బరువు, స్థూలకాయం, షుగర్, హైబీపీ, గుండెజబ్బులు మొదలైన వాటితో బాధపడే వారికి నడకతో ఎంతో మేలని వైద్యులు సూచిస్తున్నారు. పరుగులో కాలానికి ప్రాధాన్యం ఉంటుంది. ఎంత వేగంగా పరుగెత్తితే అంత తొందరగా లక్ష్యాన్ని చేరుకోగలం. కిలోమీటరు దూరాన్ని కేవలం రెండు మూడు నిమిషాల్లో చేరుకుంటారు. అదే నడక అయితే రెండు కిలోమీటర్ల దూరాన్ని పదిహేను నిమిషాల్లో పూర్తిచేస్తారు. శరీరంలో అధిక క్యాలరీల శక్తి నడక కంటే పరిగెత్తినప్పుడు ఎక్కువగా ఖర్చవుతుంది. గుండె ఆరోగ్యానికి సంబంధించిన వ్యాయామాలు చేస్తే కలిగే ప్రయోజనాలు పరుగెత్తడం వల్ల కలుగుతాయి. పరుగు వల్ల ఈ లాభాలతోపాటు అనేక సమస్యలూ ఉన్నాయట. పరుగెత్తుతుంటే కీళ్ల మధ్య ఒత్తిడి పెరుగుతుంది. కండరాలను ఎముకలకు కలిపి ఉంచే టెండాన్స్, లిగమెంట్స్‌పై ఒత్తిడి పడుతుంది. అందువల్ల కండరాలు, ఎముకల్లో గాయాలయ్యే ప్రమాదముంది. బోలు ఎముకలు (ఆస్టియో పోరోసిస్), కీళ్లనొప్పులు, గుండెజబ్బులు, ఊబకాయం తదితర సమస్యలతో బాధపడేవాళ్లు పరుగెత్తలేరు. వీళ్లు తప్పనిసరిగా నడక మాత్రమే అలవాటు చేసుకుని ప్రతి రోజూ కొంత సమయం కేటాయించాలి. పరుగెత్తక పోవడం వల్ల క్యాలరీలు ఖర్చు చేయలేకపోతున్నామనే బాధలేకుండా రెండు కిలోమీటర్ల దూరం నడిస్తే సరిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులకూ ఇదే వర్తిస్తుందని చెబుతున్నారు. రన్నింగ్, వర్కవుట్ వంటి ఓ మోస్తరు శారీరక వ్యాయామాలు చేసేవాళ్లు వారానికి 150 నిమిషాలు కేటాయిస్తే, నడక లేదా ఇతర తేలికపాటి వ్యాయామాలు చేసేవాళ్లు 300 నిమిషాలు వ్యాయామానికి కేటాయిస్తే ఇద్దరికీ సమానమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయట.





# ఒక్క చెట్టు.. ఎన్నో ప్రయోజనాలు!

పెరటి తోటల్లో ఎన్నో రకాల మొక్కలు కనిపిస్తాయి. పూలు, కూరగాయలు, ఆకుకూరల కోసం.. ఇలా పలు రకాల మొక్కలను పెంచుతుంటారు. అయితే, ఒక్క మునగ చెట్టును పెంచితే.. అనేక విధాలుగా ప్రయోజనాలు అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పెరటి తోటలో మునగ చెట్టు ఉంటే.. ఒక కూరగాయ, ఒక ఆకుకూర చెట్టు ఉన్నట్టే అని అంటున్నారు. దీని కాయలు, ఆకులను కూరల్లో వాడుకుంటే.. మునగ పూలతో 'టీ' చేసుకోవచ్చని చెబుతున్నారు. అలాగే, మునగ మొక్క సులభంగా పెరగడంతోపాటు తొందరగా కాపునకు వస్తుంది. దీనిని పెంచడానికి పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. మొక్కకు చీడపీడలు సోకకుండా.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు. అయితే, పెరటి తోటలో పెంచే మునగ చెట్టును గుబురుగా పెంచాలి. ఇందుకోసం ఒక్కో అడుగు ఎత్తు పెరిగినప్పుడల్లా.. కొమ్మల చివరలను కత్తిరించాలి. అలా కత్తిరింపులు చేసిన ప్రాంతంలో తిరిగి రెండు మూడు చిగుర్లు పుట్టుకొస్తాయి. దాంతో చెట్టు ఎక్కువ కొమ్మలతో గుబురుగా పెరుగుతుంది. లేకుంటే, చెట్టు నిటారుగా పెరిగి.. కొద్ది రోజులకే విరిగిపోయే అవకాశం ఉంటుంది. మొక్క చిన్నగా ఉన్నప్పుడు వచ్చే పూతను ఎప్పటికప్పుడు కోయాలి. అప్పుడే బాగా ఎదుగుతుంది.





# నృత్యంతో నిత్య యవ్వనం..

**మారుతున్న జీవనశైలి.. యవ్వనంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. అందంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తున్నది. ఫలితంగా.. ముప్పై ఏళ్లకే ముఖ వర్చస్సు తగ్గిపోతున్నది. ముడతలు పడి 'ముదిమి'కి చేరువవుతున్నది. నలభైల్లోనే ఊబకాయంతో శరీరం ఫిట్‌నెస్ కోల్పోతున్నది. యాభై ఏళ్లు నిండకుండానే.. వృద్ధాప్యం స్వాగతం పలుకుతున్నది. అయితే.. ఈ సమస్యలన్నిటినీ ఒకేఒక్క 'డ్యాన్స్' తరిమేస్తుంది. రోజూ ఓ గంట నృత్యం చేస్తే.. నిత్య యవ్వనం మీ సొంతమవుతుంది. అందానికి అండగా నిలవడంతోపాటు శరీరాన్నీ షార్ప్‌గా మార్చేస్తుంది.**

నృత్యంలో సెకండ్ల వ్యవధిలోనే ముఖ కవళికలు మారిపోతుంటాయి. అంటే.. ఫేషియల్ ఎక్సర్‌సైజ్‌లు పూర్తయినట్టే! దాంతో ముఖ కండరాలు బలంగా తయారవుతాయి. ముఖంపై గీతలు, ముడతలు తగ్గుముఖం పడతాయి. రక్త ప్రసరణతోపాటు ముఖవర్చస్సూ మెరుగవుతుంది.



* డ్యాన్స్‌తో జ్ఞాపకశక్తి పెరుగుతుందని 'ద న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' నిర్వహించిన అధ్యయనం తేల్చింది. కొన్నిరకాల ఏరోబిక్ డ్యాన్స్ వ్యాయామాలు.. మెదడులో జ్ఞాపకశక్తిని నియంత్రించే హిప్పోకాంపస్ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయట. ఫలితంగా, చిత్త వైకల్యం చిత్తవుతుంది.
* సంగీతానికి తగ్గట్టుగా చేసే నృత్యంతో ఒత్తిడి తగ్గుతుందని 'జర్నల్ ఆఫ్ అప్లయిడ్ జిరంటాలజీ' నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఉత్సాహంగా వేసే స్టెప్పులు.. నిరాశను తరిమికొడతాయి.
* శరీరంలో సెరటోనిన్ హార్మోన్ స్థాయిలను పెంచుతాయి. ఇవి మనిషి మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. దాంతో, శరీరమే కాదు.. ఆలోచనలూ యవ్వనంగా మారుతాయి.
* డ్యాన్స్ చేస్తున్నంత సేపు శరీరం ఉల్లాసంగా ఊగిపోతుంది. ఫలితంగా ఫిట్‌నెస్ మరింత మెరుగుపడుతుంది. బరువు తగ్గడంతోపాటు శరీరం నాజూగ్గా తయారవుతుంది.
* వయసు మీద పడేకొద్దీ వేధించే సమస్య.. కీళ్ల నొప్పులు. నృత్యంతో ఈ సమస్యకు ఇట్టే చెక్ పడిపోతుంది.
* నృత్యం వల్ల శారీరక పనితీరు మెరుగుపడుతుందని 'ద స్కాలర్లీ పబ్లిషింగ్ అండ్ అకడమిక్ రిసోర్సెస్ కోయలిషన్' పరిశోధన వెల్లడించింది.
* ఎంత వేగంగా డ్యాన్స్ చేస్తే.. అంతగా హృదయ స్పందన వేగం పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి భరోసా ఇస్తుంది. దీర్ఘకాలంలో జీవన నాణ్యతను పెంచుతుంది.
* ఇక భాగస్వామితో కలిసి చేసే డ్యాన్స్.. బంధాలను మరింత బలపరుస్తుంది. ఫలితంగా, ఆనంద భావనలు పెరిగి.. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గడంతోపాటు రోగ నిరోధక వ్యవస్థను దృఢంగా మారుస్తుంది.
* మరెందుకు ఆలస్యం! మ్యూజిక్ సిస్టం ఆన్‌చేసి.. ఏజ్‌తో మ్యాజిక్ చేసేయండి. ఇష్టమైన పాటలకు స్టెప్పులేస్తూ.. వయసును ఒక్కో స్టెప్పు తగ్గించుకోండి.

# అందానికి తేనె అద్దుదాం

అమోఘమైన రుచి, అరుదైన లక్షణాలు గల దివ్యౌషధం తేనె. సౌందర్యానికీ, ఆరోగ్యానికీ దోహదపడే సుగుణాల గని. అందుకే ఆహారంలోనూ, ఔషధాల్లోనూ తేనె వాడకం ఎక్కువ. ముఖ్యంగా వేసవిలో తలెత్తే సమస్యలకు చక్కని పరిష్కారం ఇది. చర్మం జిడ్డుగా మారడం, జుట్టు జీవం కోల్పోవడం వంటి వేసవికాల సమస్యలకు తేనె మంచి ఉపశమనం.

* ఒక టేబుల్ స్పూన్ తేనెకు కొద్దిగా పాలు కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. బాగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. వారానికి రెండు మూడుసార్లు ఇలా చేయడం వల్ల నల్లని మచ్చలు, మొటిమలు తగ్గుతాయి.
* తేనెలో కొంచెం నిమ్మరసం కలిపి బ్లాక్‌హెడ్స్‌పై రాసి పది నిమిషాల తర్వాత కడిగేయాలి. తరచూ ఇలా చేస్తే బ్లాక్‌హెడ్స్ క్రమంగా తగ్గిపోతాయి.
* కాలిన గాయాలపైన తేనెను పూయడం వల్ల మచ్చలు పడవు. పెదాలను తేనెతో మర్దనా చేస్తే పొడిబారకుండా ఉంటాయి. తేనె మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేసి చర్మకాంతిని పెంచడమే కాకుండా, మృదువుగా మారుస్తుంది.
* వెంట్రుకలు నిర్జీవంగా మారితే ఆలివ్‌నూనెలో తేనె కలిపి రాత్రి పడుకునేముందు వెంట్రుకలకు బాగా పట్టించాలి. మర్నాడు తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తే వెంట్రుకలు చిట్లకుండా ఉంటాయి.



# లాభాల్లో స్టాక్ మార్కెట్లు..

## 82వేల ఎగువన ముగిసిన సెన్సెక్స్..!




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఉదయం మార్కెట్లు లాభాల్లోనే మొదలయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,928.95 పాయింట్ల లాభంతో మొదలైంది. ఇంట్రాడేలో 81,867.23 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,492.24 పాయింట్ల దాకా పెరిగింది. చివరకు 455.38 పాయింట్ల లాభంతో 82,176.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148 పాయింట్లు పెరిగి 25,001.15 వద్ద ముగిసింది. దాదాపు 2213 షేర్లు లాభపడగా.. మరో 1,700 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో బజాజ్ ఆటో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎంఅండ్ఎం, హిందాల్కో, ట్రెంట్, నెస్లే, హెచ్‌సీఎల్ టెక్, ఐటీసీ, టాటా మోటార్స్, హెచ్‌యూఎల్, లార్సెన్, టెక్ మహీంద్రా లాభపడ్డాయి. ఎక్స్‌టర్నల్, కొటక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, టాటాస్టీల్, మారుతి సుజుకీ, గ్రాసిమ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ నష్టపోయాయి.

## పతంజలి నుంచి రూ.14 వేలకే ఈవీ స్కూటర్..!




**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది. ఎలక్ట్రిక్ స్కూటర్ల అమ్మకాలు కూడా వేగంగా పెరిగాయి. ఈ కారణంగా అనేక కొత్త కంపెనీలు ఈ విభాగంలోకి ప్రవేశించి వారి స్వంత ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేశాయి. యోగా గురువు బాబా రామ్‌దేవ్ కంపెనీ పతంజలి త్వరలో తన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేయనుందని చాలా రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

ఆసక్తికరంగా ఈ నెల ప్రారంభంలో కొన్ని వెబ్‌సైట్‌లు, సామాజిక వినియోగదారులు పతంజలి నుండి వచ్చిన ఈ ఇ-స్కూటర్ గురించి కొంత సమాచారాన్ని ప్రచురించారు. పతంజలి ఈ-స్కూటర్ గురించి అనేక ప్రకటనలు వైరల్ అవుతున్నాయి. ఈ స్కూటర్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 440 కి.మీ ప్రయాణించగలదు. ఇది 1000 మీటర్ల దూరం కదులుతుందని చెబుతున్నారు. అంతే కాదు ఆ స్కూటర్ ధర కేవలం రూ.14,000 నుంచి ప్రారంభమవుతుందనే సమాచారం వైరల్ అవుతోంది. ఈ ప్రకటనలతో పాటు ఎలక్ట్రిక్ స్కూటర్ ఫొటో కూడా ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. ఈ ప్రకటన చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

పతంజలి ఎలక్ట్రిక్ స్కూటర్ గురించి సోషల్ మీడియాలో చేస్తున్న వాదనలు పూర్తిగా నిరాధారమైనవిగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముందుగా ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను లాంచ్ చేయడం గురించి పతంజలి స్వయంగా ఎప్పుడూ ఏమీ చెప్పలేదు. పతంజలి ఎలక్ట్రిక్ స్కూటర్ ధర, ఫీచర్ల గురించి చెప్పడం పూర్తి అబద్ధం.

పతంజలి బ్రాండ్ గురించి పరిచయం అవసరం లేదు. ఈ కంపెనీ మార్కెట్లో మందులు, సబ్బులు, సౌందర్య ఉత్పత్తులతో పాటు అనేక ఆయుర్వేద ఉత్పత్తులను విక్రయిస్తుంది. ఈ కంపెనీ పెద్ద మొత్తంలో ఆయుర్వేద ఉత్పత్తులను డీల్ చేస్తుంది. పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులపై భారతదేశ ప్రజలకు కూడా చాలా నమ్మకం ఉంది. అయితే, పతంజలి ఏ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేయడం లేదు.

## దిగొస్తున్న పసిడి..



**న్యూఢిల్లీ:** పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. అటువంటి పరిస్థితిలో మీరు బంగారం, వెండి కొనాలని ఆలోచిస్తుంటే, లేదా బంగారం, వెండిలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నట్టయితే..ఇది మీకు సరైన సమయం అని చెప్పాలి. ఎందుకంటే ప్రస్తుతం పసిడి పరుగులకు చిన్న కళ్లెంపడినట్టుగా కనిపిస్తుంది. బంగారం, వెండి ధరలు ఏ రోజు కారోజు తగ్గినట్టే తగ్గి మళ్లీ అమాంతంగా పెరిగిపోతున్నాయి. కానీ, మే 26న గోల్డ్ రేట్ కాస్త దిగొచ్చింది. భారతదేశ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు కొనుగోలుదారులకు కాస్త ఊరట నిస్తున్నాయి. ఇక్కడ బంగారం ధరలు తగ్గాయి.

గత కొన్ని రోజులుగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. స్వల్ప హెచ్చుతగ్గులు మినహా సామాన్యులకు అందనంత ఎత్తులోనే పుత్తడి ధరలు ఉంటున్నాయి. నేడు మే 26న భారతదేశ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ.9,807లుగా ఉంది. అదే విధంగా 22 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ.8,989లుగా ఉంది. ఇకపోతే, 18 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ.7,355లు పలుకుతోంది.

### దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..

చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.90,040, 24 క్యారెట్ల ధర రూ.98,220 గా ఉంది. హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.89,890, 24 క్యారెట్ల ధర రూ.98,070 గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.89,890, 24 క్యారెట్ల ధర రూ.98,070 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.89,890, 24 క్యారెట్ల ధర రూ.98,070 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.89,890, 24 క్యారెట్ల రేటు రూ.98,070 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.89,890, 24 క్యారెట్ల ధర రూ.98,070 గా ఉంది. విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,890, 24 క్యారెట్ల ధర రూ.98,070 గా ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,890, 24 క్యారెట్ల ధర రూ.98,070గా ఉంది. ఇకపోతే, భారతదేశ మార్కెట్లో నేటి వెండి ధర గ్రాము రూ.110.80లుగా కాగా, కిలో వెండి ధర రూ1,10,800గా పలుకుతోంది.




# తేజస్వినికి స్వర్ణం






## 11 పతకాలతో అగ్రస్థానంలో భారత్

**న్యూయార్క్:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత షూటర్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. పోటీ పడి మరీ పోడియం మీద మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తున్నారు. సోమవారం కూడా భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో తేజస్విని పసిడితో మెరిసింది. ఎనిమిది పోటీ పడగా.. ఐదు షూట్ల తర్వాత ఆమె 31 పాయింట్లు సాధించి బంగారు పతకాన్ని కొల్లగొట్టింది. దాంతో, పతకాల పట్టికలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. సోమవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో తేజస్విని 575 పాయింట్లతో 4వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో గురి తప్పకుండా గన్ పేల్చిన తను స్వర్ణంతో భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసింది. అయితే.. క్వాలిఫయర్‌లో అగ్రస్థానంలో నిలిచిన చైనా షూటర్ టవోటవో ఝూవో ఐదో స్థానంతో నిరాశపరిచింది. అయితే.. ఇదే విభాగంలో పోటీపడిన భారత అమ్మాయిలు రియా శిరీష్ థట్టే, నామ్య కపూర్, వివాన్షిలు వరుసగా 15, 18, 24వ స్థానంతో సరిపెట్టుకున్నారు.

తేజస్విని తర్వాతి ప్లేస్‌లో నిలిచిన బెలారస్ అమ్మాయి అలీనా నెస్టియరోవిచ్ వెండి పతకం గెలవగా.. హంగేరీ షూటర్ మిరియం జాకో కాంస్యంతో మురిసింది. మొత్తంగా చూస్తే.. భారత బృందం మూడు స్వర్ణాలు, నాలుగు రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 11 మెడల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

### అడ్రియాన్‌కు డబుల్

ఈ టోర్నీలో మే 23న శుక్రవారం యువ షూటర్ అడ్రియాన్ కర్మాకర్ కాంస్యంతో గర్జించాడు. 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్స్‌లోకి కంచు మోత మోగించి రెండో మెడల్ ఖాతాలో వేసుకున్నాడు. తొలిసారి వరల్డ్ కప్‌లో పోటీ పడుతున్న ఈ కుర్ర షూటర్ గురువారం 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో రజత పతకం గెలుపొందిన విషయం తెలిసిందే.

# టీమిండియా రిజర్వ్ ఓపెనర్ వీడ్కోలు

## దేశవాళీ 'రన్ మెషీన్' రికార్డులు



**న్యూఢిల్లీ:** దేశవాళీ క్రికెట్‌లో మరో క్రికెటర్ శకం ముగిసింది. విధ్వంసక ఆటగాడిగా పేరొందిన గుజరాత్ మాజీ కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ వీడ్కోలు పలికాడు. భారత ఏ జట్టుకు సైతం సారథిగా వ్యవహరించిన ప్రియాంక్.. అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నానని వెల్లడించాడు. ఈ విషయాన్ని గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ సోమవారం అధికారికంగా తెలిపింది. 35 ఏళ్ల ప్రియాంక్ గుజరాత్ క్రికెట్‌కు విశేష సేవలు అందించాడు. 17 ఏళ్ల పాటు నిలకడగా రాణించాడని అతడిని కొనియాడింది జీసీఏ.

'కుడిచేతి వాటం బ్యాటర్ అయిన ప్రియాంక్ ఇండియా ఏ కెప్టెన్‌గానూ రాణించాడు. అతడు ఒక రన్ మెషిన్. 17 ఏళ్లు అతడు దేశవళీలో గుజరాత్ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. సారథిగానూ తన ముద్రవేశాడు. అద్భుతమైన కెరీర్ సాగించిన ప్రియాంక్‌కు మా అసోసియేషన్ తరఫున అభినందనలు. మే 26న ఈ డాషింగ్ బ్యాటర్ అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు' అని గుజరాత్ క్రికెట్ అసోషియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

### టీమిండియా రిజర్వ్ ఓపెనర్

ఓపెనింగ్ బ్యాటర్ అయిన ప్రియాంక్ 2021లో టీమిండియాకు ఎంపికయ్యాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌కు ఓపెనర్ రోహిత్ శర్మకు ప్రత్యామ్నాయంగా అతడిని జట్టులోకి తీసుకున్నారు సెలెక్టర్లు. బెంగాల్ ఆటగాడు అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి రిజర్వ్ ఓపెనర్‌గా ప్రియాంక్‌ను ఎంపికయ్యాడు. అయితే.. తుది జట్టులో మాత్రం చోటు దక్కలేదు. ప్రియాంక్ తన సుదీర్ఘ కెరీర్‌లో 127 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. 2016-17 రంజీ సీజన్‌లో అతడు ప్రత్యర్థులకు తన ఉగ్రరూపం చూపించాడనుకో.

ఆ సీజన్లో రెచ్చిపోయి ఆడిన ఈ రైట్ హ్యాండర్ అజేయ త్రిపుల్ సెంచరీ(314 నాటౌట్)తో గర్జించాడు. భీకర ఫామ్‌లో ఉన్న అతడు ఆ ఎడిషన్లో ఏకంగా 1,310 రన్స్ కొట్టాడు. అతడి మెరుపులతో గుజరాత్ ఆ సీజన్‌లో విజేతగా నిలిచింది. 2012-13లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పాటు 2015-16లో విజయ్ హజారే ట్రోఫీ గెలుపొందిన జట్టులో కూడా ప్రియాంక్ సభ్యుడు. ఆసాంతం దంచికొట్టడమే మంత్రగా ఆడిన ఈ చిచ్చరపిడుగు డొమెస్టిక్‌లో 29 సెంచరీలు, 34 అర్ధ శతకాలు బాదేశాడు. 97 లిస్ట్ ఏ మ్యాచుల్లో 8 సెంచరీలతో కలిపి 3,672 రన్స్ కొట్టాడు. 59 టీ20లు ఆడిన ప్రియాంక్ 28.71 సగటుతో 1,522 పరుగులు సాధించాడు.

# జూన్‌లో ఇంగ్లండ్ పర్యటన







## జియో హాట్‌స్టార్‌కు డిజిటల్ హక్కులు..!

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేస్తున్న జియో సంస్థ మరోమారు అభిమానులకు క్రీడా వినోదం పంచనుంది. త్వరలో భారత్, ఇంగ్లండ్ ఐదు టెస్టు మ్యాచ్‌ల డిజిటల్ మీడియా హక్కులను జియో హాట్‌స్టార్ దక్కించుకుంది. సోనీ స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్, కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటిడె సంస్థలతో పోటీపడి .. డిజిటల్ రైట్స్ సొంతం చేసుకుందని సమాచారం. ఈ విషయాన్ని క్రిక్‌బజ్ సోమవారం వెల్లడించింది.

జూన్‌లో మొదలయ్యే ఇంగ్లండ్ పర్యటన డిటిటల్ హక్కుల కోసం ఏప్రిల్ నెల నుంచే జియో హాట్‌స్టార్, సోనీ స్పోర్ట్స్, కల్వర్ మ్యాచ్స్ సంస్థల మధ్య మంతనాలు జరుగుతున్నాయి. అయితే.. భారత జట్టుకు కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను ప్రకటించిన తర్వాత చర్చలు చివరి దశకు వచ్చాయి. ఎట్టకేలకు ఆదివారం జియో హాట్‌స్టార్ ఈ ప్రతిష్ఠాత్మక సిరీస్ డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకుంది. అయితే.. సోనీ సంస్థ కూడా డిజిటల్ మ్యాచ్‌లను ప్రసారం చేసేందుకు ఇరువురి మధ్య అంగీకారం కుదిరింది.

అంతేకాదు.. సోనీ టీవీ నెట్‌వర్క్‌లో కూడా భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. అయితే.. ఇరు జియో, సోనీల మధ్య ఈ ఒప్పందం వచ్చే ఏడాది వరకూ కొనసాగనుంది. 2026లో భారత్.. ఇంగ్లండ్ పర్యటనలో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ ఎనిమిది మ్యాచ్‌లను జియో హాట్‌స్టార్‌లో అభిమానులు ఆస్వాదించవచ్చని క్రిక్‌బజ్ తెలిపింది.

జూన్ 20న తొలి టెస్టుతో

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇరుజట్ల మధ్య జూన్ 20న టెస్టుతో సిరీస్ మొదలవ్వనుంది. జూలై 2న బర్మింగ్‌హామ్‌లో రెండో టెస్టు, అనంతరం జూలై 10న లార్డ్స్ వేదికగా మూడో టెస్టు, మాంచెస్టర్‌లో జూలై 23న నాలుగో మ్యాచ్.. ఓవల్‌లో జూలై 31న ఐదో టెస్టు జరుగనుంది.

# ఐపీఎల్ పాయింట్స్ టేబుల్ టాపర్‌గా పంజాబ్..

## ముంబై ఎలిమినేటర్‌కు..!

**జైపూర్:** ఐపీఎల్ 2025లో పాయింట్స్ టేబుల్ టాపర్‌గా పంజాబ్ కింగ్స్ దూసుకొచ్చింది! టాప్-2లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో ముంబై ఇండియన్స్‌తో తలపడ్డ ఆ జట్టు ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. పటిష్ట ముంబైని ఏడు వికెట్ల తేడాతో ఓడించి.. క్వాలిఫయర్-1కు అర్హత సాధించింది. టాప్-2లో నిలవాలని కలలు కన్న ముంబై ఇండియన్స్‌కు నిరాశ మిగిల్చింది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్.. ఫస్టు బౌలింగ్ ఎంచుకుంది. అయితే ముంబై ఇండియన్స్ బ్యాటర్లు ధాటిగా బ్యాటింగ్ చేయడంతో ముంబై స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. సూర్యకుమార్ యాదవ్(39 బంతుల్లో 57 రన్స్) రాణించడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 184/7 పరుగులు స్కోరు చేసింది. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ 2, మార్కో జాన్సెన్ 2, విజయ్ కుమార్ వైశాఖ్ 2, హర్‌ప్రీత్ బ్రార్ 1 వికెట్ తీశారు.

అనంతరం 185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ మరో 9 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించింది. ప్రియాన్స్ ఆర్యా (35 బంతుల్లో 61 రన్స్), జోష్ ఇంగ్లిస్ (42 బంతుల్లో 73 రన్స్) జట్టుకు బలమైన పునాది వేశారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16 బంతుల్లో 26 రన్స్) విన్నింగ్ షాట్‌తో తమ జట్టును అగ్రస్థానంలోకి తీసుకెళ్లాడు.

ఈ విజయంతో పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. దీంతో క్వాలిఫయర్-1 ఆడేందుకు అర్హత సాధించింది. ముంబై ఇండియన్స్ నాలుగో స్థానానికి పరిమితమైంది. ఇక ఈ టోర్నీలో చివరి లీగ్ మ్యాచులో మంగళవారం ఆర్సీబీ, లక్నో సూపర్ జెయింట్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచులో ఆర్సీబీ గెలిస్తే.. క్వాలిఫయర్-1లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఓడితే మాత్రం గుజరాత్ టైటాన్స్.. రెండో ప్లేసుతో లీగ్ స్టేజ్‌ను ముగిస్తుంది. అప్పుడు క్వాలిఫయర్ 1లో పంజాబ్- గుజరాత్, ఎలిమినేటర్‌లో ఆర్సీబీ-మంబై ఇండియన్స్ తలపడాల్సి ఉంటుంది.

క్వాలిఫయర్-1లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్ చేరుతుంది. ఓడిన జట్టు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం ఉంటుంది. ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టుతో ఆ జట్టు క్వాలిఫయర్-2 ఆడాల్సి ఉంటుంది.



# అంజలి టాలెంట్‌ను గుర్తించని టాలీవుడ్



టాకీస్: హీరోయిన్ అంజలి గురించి పరిచయం అక్కర్లేదు. తెలుగు అమ్మయి అయినప్పటికి తమిళంలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. టాలీవుడ్‌లో మాత్రం ఎప్పుడూ ఛాన్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. వెంకీ, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోలు జతకట్టిన.. అవకాశాలు మాత్రం దక్కడం లేదు. ఆమె మంచి నటిగా గుర్తింపు పొందినా పెద్దగా పట్టించుకోవడం లేదు. ప్రజెంట్ ఆమె చేతిలో ఒక్కటంటే ఒక్క తెలుగు సినిమా కూడా లేదు. గీతాంజలి మళ్లీ వచ్చింది, గేమ్స్ ఆఫ్ గోదావరి, గేమ్ ఛేంజర్ లాంటి వరుస ఫ్లాపులు ఆమెకు ఛాన్సులు లేకుండా చేస్తున్నాయి. గ్లామర్ షో చేస్తూ టాలెంట్ ఉన్నప్పటికి.. టాలీవుడ్ దర్శకులు ఆమెను కన్సిడర్ చేయడం లేదు. కానీ..తెలుగు ఇండస్ట్రీ కాదంటున్నా.. తమిళ చిత్ర పరిశ్రమ అంజలికి ఎప్పుడూ ఛాన్సులు ఇస్తూనే ఉంది. రీసెంట్‌గా 'మదగజరాజా'తో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ తెలుగమ్మాయి.. ప్రస్తుతం కోలీవుడ్ లో రెండు సినిమాలు చేస్తోంది. 'ఈగై' తో పాటు- 'పరందు పో' అనే మూవీ చేస్తోంది. పరాయి ఇండస్ట్రీ హీరోయిన్స్ ని కోట్లు పెట్టి తీసుకుంటారు.. కానీ తెలుగు టాలెంటెడ్ యాక్టర్స్ ను మాత్రం గుర్తించరు అనే అపవాదు ఎప్పటి నుంచో ఉంది. ఇక అంజలి విషయంలో ఇదే జరుగుతుంది.

# పవన్ కళ్యాణ్ సినిమాలు ఆపే దమ్ము ఎవరికీ లేదు

## హరిహరవీరమల్లు విషయంలో తప్పుగా వెళ్లింది
## థియేటర్ల బంద్ అన్నది లేనేలేదు
## మంత్రి దుర్గేశ్‌కు ఇదే విషయం చెప్పా
## మీడియా సమావేంలో నిర్మాత దిల్ రాజ్



**టాకీస్:** పవన్ కళ్యాణ్ సినిమాలు నడవకుండా ఆపే దమ్ము ఎవరికీ లేదని, థియేటర్ల మేసివేత జరగదని నిర్మాత దిల్‌రాజ్ స్పష్టం చేశారు.రెంట్,పర్సెంట్ గొడలవలతో అనవసరంగా థియేటర్ల మూత అంశం ప్రచారం జరిగిందన్నారు. థియేటర్ల వివాదం అంశం మిాద అనేక చర్చలు జరుగుతున్న క్రమంలో నిన్న అల్లు అరవింద్ తర్వాత సోమవారం దిల్ రాజు మిాడియా ముందుకు వచ్చారు. నిర్మాతలందరం ఎగ్జిబిటర్ల సమస్యలపై చర్చించాం. 'హరిహర వీరమల్లు' విషయంలో తప్పుగా వెళ్లింది. పవన్‌కల్యాణ్ సినిమాలను ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు. మంత్రి దుర్గేష్కు ఫోన్ చేస్తే థియేటర్లు మూసివేయరని స్పష్టంగా చెప్పా. తప్పుడుగా సమాచారం వచ్చిందని ఆయనకు వివరించా. జూన్ నెలంతా పెద్ద సినిమాలున్నాయి. ఈ సమయంలో సినీ పరిశ్రమను ఎలా కాపాడుకోవాలనేదే అందరి తపన అని అన్నారు. జూన్, జులై, ఆగస్టు సినిమాలకు కీలక సీజన్. ఈస్ట్ గోదావరిలో ఓ వ్యక్తితో మొదలైన సమస్య తెలంగాణకు ఆపాదించారు. సినిమా వాళ్లకు రెండూ ప్రభుత్వాలు చాలా ముఖ్యం. సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్యలో అనుసంధానంగా ఉండాలనే సీఎం రేవంత్‌రెడ్డి నన్ను ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా పెట్టారు. కళ్యాణ్‌గారు చెప్పాక పక్కంటికి వెళ్లినంత సులభంగా వెళ్లి పేపర్ పట్టుకొని టికెట్ ధరలు పెంచుకొని వస్తున్నారు. అందరం కలిసి ఐక్యంగా ఉండాలనే ఆలోచన మా దగ్గర తక్కువ. ఉత్తరాంధ్రలో మాకు డిస్ట్రిబ్యూషన్ ఆఫీసు ఉంది, అక్కడ 20 థియేటర్లు ఉన్నాయి. రెండు ప్రభుత్వాలు సినీ పరిశ్రమకు అండగానే ఉన్నాయి. ఛాంబర్‌లోనే కొట్టుకుంటారు. ఐక్యత లేదు. ఈ ఎపిసోడ్‌తో ఇప్పటికైనా తెర దించుదాం అని దిల్‌రాజు అన్నారు. ఇకపోతే అసలు ఈ వివాదం ఎక్కడ మొదలైంది అనే విషయం మిాద ఆయన క్లారిటీ ఇచ్చారు. ఈ అంశం ఎక్కడ మొదలైంది అంటే ఏప్రిల్ 19వ తేదీన ఈస్ట్ గోదావరి డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిబిటర్స్ అందరూ ఒక మిాటింగ్ పెట్టుకున్నారు. అప్పుడు ఆ మిాటింగ్ లో ఎగ్జిబిటర్లు వాళ్లకున్న సమస్యలు చెప్పుకొని రెంటల్ విధానాల్లో సినిమాలు ఆడిస్తే మాకు వర్కౌట్ కావడం లేదు కాబట్టి మాకు పర్సంటేజీ విధానం ఉంటే బాగుంటుందని డిస్ట్రిబ్యూటర్లకు చెప్పడం జరిగింది. ఈరోజు ప్రతి సినిమా సంవత్సరంలో 150 సినిమాలు రిలీజ్ అయితే 90 సినిమాలు అందరూ పర్సంటేజ్ విధానంలోనే రిలీజ్ చేస్తున్నారు. కొన్ని సినిమాలు మాత్రమే రెంట్ ఆర్ పర్సంటేజ్ విధానాల్లో ఆడుతున్నారు. అక్కడే ఎగ్జిబిటర్లకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈస్ట్ గోదావరిలో డిస్ట్రిబ్యూటర్లు ఎగ్జిబిటర్లు మిాటింగ్ పెట్టుకుని వారు ఈ విధానం తీసుకురావాలని కోరడం జరిగింది. అయితే డిస్ట్రిబ్యూటర్లు ఆ విషయాన్ని ఒప్పుకోలేదు. అదే విషయం మా హైదరాబాదులో ఉన్న నిర్మాతల దృష్టికి వచ్చింది. ఏప్రిల్ 26వ తేదీన నిర్మాతల గిల్డ్ మిాటింగ్ జరిగింది. ఆ మిాటింగ్ సమయానికి ఒకవేళ జూన్ 1వ తేదీకి వారు కోరుకున్న విధంగా పర్సంటేజీ విధానంలో సినిమాలు ఆడించకపోతే సినిమా థియేటర్లో ఆపాలమే నిర్ణయం తీసుకున్నట్లు మా దృష్టికి తీసుకువచ్చారు.





# గ్యాంబ్లర్స్ టీజర్ విడుదల

**టాకీస్:** సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమా జూన్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'యుద్ధం ఎక్కడ మొదలు పెట్టాలో తెలియాలి.. జూదం ఎక్కడ ఆపాలో తెలియాలి' అనే డైలాగుతో ప్రారంభమైన టీజర్ ఆసక్తిగా ఉంది.

# 28న మిరాయ్ మూవీ టీజర్

**టాకీస్:** 'హనుమాన్' మూవీతో తేజ సజ్జా మార్కెట్ ఎలా పెరిగిందో తెలిసిందే. ఒక్కసారిగా పాన్ ఇండియా హీరో అయ్యాడు. తెలుగు సూపర్ హీరోగా మారిపోయాడు. దీంతో తన తదుపరి ప్రాజెక్ట్‌లు ఆచితూచి ఎంచుకుంటూ వస్తున్న తేజ, ప్రస్తుతం 'మిరాయ్' అనే చిత్రంలో ఫుల్ బిజీగా ఉన్నాడు. సూపర్ యోధ పాత్ర కోసం అంచనాలు పెంచాయి. ఇక తాజాగా ఇప్పుడు మూవీ టీం నుంచి అప్డేట్ అయితే వచ్చింది. మే 28న టీజర్ రాబోతున్నట్లు ప్రకటించారు. మిరాయ్ టీజర్ వచ్చిన తర్వాత లెక్క వేరేలా ఉంటుందని టీం హైప్ పెంచేస్తోంది. కాగా ఈ ప్రకటనలో భాగంగా ఓ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తేజ రన్నింగ్ ట్రైన్‌పై వెళ్తు కనిపించాడు. ఇక వీరికి



మరోసారి కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు తేజ. మనోజ్ మంచు విలన్‌గా, రీతికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ సినిమాపై భారీ తగ్గట్టుగా రానా కూడా మిరాయ్ మీద అంచనాలు పెంచే పనిలో పడ్డారు. కాగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో, 2డీ, 3డీ ఫార్మాట్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు.

# కన్నప్పలో ప్రభాస్ పాత్ర అమోఘం

## ప్రమోషన్ కార్యక్రమంలో మంచు విష్ణు

**టాకీస్:** కన్నప్ప ప్రమోషన్లు జోరుగా సాగుతున్నాయి. జూన్ 27న వస్తున్న ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభాస్, కాజల్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ కీలక పాత్రల్లో చేస్తున్న సంగతి తెలిసిందే కదా. అయితే ప్రభాస్ పాత్ర గురించి పెద్ద చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభాస్ పాత్ర గురించి మంచు విష్ణు రకరకాల కామెంట్లు- చేస్తూ వస్తున్నాడు. తాజాగా ప్రభాస్ పాత్ర కన్నప్పలో ఎంత టైమ్ ఉంటుందో చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. ఈ సినిమాలో ప్రభాస్ ను అతిథి పాత్ర కోసం తీసుకోవాలని ముందుగా అనుకున్నాం. కానీ తర్వాత 30 నిముషాల వరకు ప్రభాస్ పాత్రను పెంచేశాం. చివరి 50 నిముషాలు ప్రభాస్ ను ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేస్తారు. నాకు తెలిసి ఈ పాత్ర ప్రభాస్ లైఫ్ లో ది బెస్ట్ అవుతుందని నేను



అనుకుంటున్నాను. పాత్ర అద్భుతంగా వచ్చింది.

ప్రభాస్ హైట్, ఫేస్ కట్ అవన్నీ దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశాం. ప్రభాస్‌కు మా నాన్న మోహన్ బాబుకు మధ్య వచ్చే సీన్లు అద్భుతంగా ఉంటాయి. ఇందులో మోహన్‌లాల్ పాత్ర 15 నిమిషాలు, అక్షయ్ కుమార్ 10 నిమిషాలు కనిపిస్తారు. సినిమా మొత్తం3 గంటల 10 నిమిషాలు ఉంటుంది. ప్రభాస్ పాత్ర మూవీపై మంచి ఇంపాక్ట్ చూపిస్తుంది' అంటూ చెప్పారు విష్ణు.

# టాలీవుడ్‌లోకి కొత్త అందం

## రెండో సినిమాతోనే పాన్ ఇండియా కేజ్

టాకీస్: టాలీవుడ్ ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. కొత్త హీరోయిన్స్ చాలా మంది తన అందంతో నటనతో ఆకట్టుకుంటున్నారు. అలా టాలీవుడ్ కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటిస్తుంది. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలలో తన కెరీర్ ను ప్రారంభించింది.ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆతర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్ గా మారింది.'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. మంచు విష్ణు తెరకెక్కిస్తున్న కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతి ముకుందన్మంచు. కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ చిన్నది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు చుస్తే నోరెళ్లబెట్టాల్సిందే.. ఈ ఫొటోలకు కుర్రాళ్ళు రొమాంటిక్ కామెంట్స్ చేస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.